## గురుకుల విద్యార్థిని ఐక్యరాజ్య సమితి కాన్ఫరెన్స్‌కు ఎంపిక

మొయినాబాద్, జూలై 31 : వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రాంతానికి చెందిన పాస్టర్ కృపావరం మొయినాబాద్‌లో స్థిర నివాసం ఉంటూ పాస్టర్‌గా పని చేస్తున్నారు. అతడి బిడ్డ మెరల్ మెరబ్ ఘట్‌కేసర్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నప్పుడు సువర్ణ అవకాశం వచ్చింది. మలేషియాలోని కౌలాలంపూర్‌లో 2024 ఆగస్టు 2, 3, 4, 5 తేదీల్లో నిర్వహించే ఐక్యరాజ్య సమితి యూత్ కాన్ఫరెన్స్‌కు 2023లో సంబంధిత పరీక్ష రాసింది. పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చగా మళ్లీ జూమ్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూలో కూడా నెగ్గింది. దీంతో ఐక్యరాజ్య సమితి కాన్ఫరెన్స్‌కు ఎంపికయ్యింది. రాష్ట్రం నుంచి ఐక్య రాజ్య సమితి యూత్ కాన్ఫరెన్స్‌కు ఎంపిక సందర్భంగా మెరల్ మెరబ్ సీం రేవంత్‌రెడ్డిని కలువగా అభినందించారు. తండ్రి కృపావరం మాట్లాడుతూ.. దేశంలో పది మంది ఎంపిక కాగా.. అందులో తన బిడ్డ ఎంపిక కావడం సంతోషంగా ఉన్నదని పేర్కొన్నారు.


మెరల్ మెరబ్‌ను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

## ఫార్మాసిటీ రద్దుపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలి

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**



ఇబ్రహీంపట్నం, జూలై 31 : అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీని రద్దుచేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన మాటపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్‌పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఫార్మాసిటీని రద్దు చేస్తామని, భూములను తిరిగి రైతులకు ఇచ్చేస్తామని కాంగ్రెస్ నాయకులు పదేపదే చెప్పారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా అదే అంశాన్ని పొందుపర్చిన కాంగ్రెస్ ఎన్నికల తర్వాత పొంతన లేకుండా మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. మీర్‌ఖాన్‌పేట్‌లో నైపుణ్య శిక్షణా కేంద్రానికి భూమి పూజకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా ఫార్మాసిటీపై ప్రభుత్వ విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని కోరారు. రైతులను మభ్యపెట్టే మాటలకు తెరదించాలన్నారు. ఫార్మాసిటీని రద్దు చేసి, భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని మంచిరెడ్డి డిమాండ్ చేశారు. దీనిపై ఇప్పటికే బీఆర్ఎస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని, వాళ్ల హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలకులు, ఎమ్మెల్యే, వారి నాయకుల నాలిక మడతపడితే రైతులు తిరగబడతారని హెచ్చరించారు.

గత ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి, మల్‌రెడ్డి, కోదండరెడ్డి, కోదండరాం రెడ్డి, తీన్మార్ మల్లన్న ఫార్మాసిటీ రద్దుపై, భూములను తిరిగి రైతులకు ఇవ్వడంపై చేసిన ప్రకటనలను మరొక్కసారి గుర్తుచేశారు. పాదయాత్ర సందర్భంగా భట్టి విక్రమార్క, సీతక్క ఫార్మా రైతులకు మద్దతు తెలిపిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మీర్‌ఖాన్‌పేట్ సమీపంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మాజీ జడ్పీటీసీలు రమేశ్‌గౌడ్, జంగమ్మ, రామచంద్రయ్య, సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పాశ్చ బాషా, రవికిరణ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భీమ్‌రావు ఉన్నారు.


పాడి పంటలతో.. పిల్లా జెల్లాను సల్లంగా సూడు పోచమ్మ తల్లీ అంటూ పెద్దేముల్ గ్రామస్తులు బుధవారం పోచమ్మకు ఆషాఢమాసం బోనాలను సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం మహిళలు ప్రత్యేకంగా బోనాలలు, నైవేద్యాలతో పోచమ్మ ఆలయానికి గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తూ అమ్మవారికి బోనం, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. – పెద్దేముల్, జూలై 31

## నక్ష తయారు చేయాలి

**ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి**

నందిగామ, జూలై 31 : కేశంపేట మండలం చింతకుంటపల్లి గ్రామానికి రెవెన్యూ నక్షను తయారుచేసేలా ప్రభుత్వం తీసుకోవాలని ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి బుధవారం రాష్ట్ర శాసనమండలిలో ప్రభుత్వాన్ని కోరారు. రెవెన్యూ శాఖ సేవలు, సమస్యలపై చర్చలో భాగంగా ఆయన వ్యవసాయ భూములకు నక్ష లేకపోవడంవల్ల రైతులకు జరుగుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. చింతకుంటపల్లి గ్రామం మొదటినుంచి రెవెన్యూ గ్రామమైనప్పటికీ, భూములకు రెవెన్యూ లక్ష లేకపోవడంతో రైతుల మధ్య తగాదాలు ఏర్పడుతున్నాయని సభ దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్సీ విన్నవించిన సమస్యపై చర్యలు తీసుకొని న్యాయం చేస్తామని సంబంధిత శాఖ మంత్రి పేర్కొన్నారు. చింతకుంటపల్లి గ్రామ సమస్యలు ఎమ్మెల్సీ శాసనమండలిలో ప్రస్తావించడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలి

**వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి**

వికారాబాద్, జూలై 31 : ఎక్కడ పని చేసినా ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం జిల్లాలో ఏఎస్ఐలు, హెచ్‌సీలు, పీసీల బదిలీలు జరిగాయి. జిల్లాలో సిబ్బంది సాధారణ బదిలీల్లో భాగంగా ఎస్పీ ఏడుగురు ఏఎస్ఐలు, ఆరుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 49 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు కౌన్సెలింగ్ ఇచ్చి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేసి మంచి పేరు తీసుకురావాలని, ఎక్కడ పని చేసినా ప్రజాసేవే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రజలకు మేమున్నాం అని భరోసా కలిగించి, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏవో జ్యోతిర్మయి, ఇన్‌స్పెక్టర్ రాజు, సెక్షన్ సూపరింటెండెంట్ మోహనప్ప, జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్, అధికారులు పాల్గొన్నారు.

## మూగజీవాల గోడు పట్టదా !

- పశువుల డాక్టర్ లేక పశువులు మృత్యువాత
- నాగారం గ్రామంలో మృతి చెందిన మేక పిల్లతో ఓ రైతు వినూత్న నిరసన


నాగారం గ్రామంలోని పశువుల దవాఖాన బోర్డుకు మృతి చెందిన మేక పిల్లని కట్టి వినూత్న నిరసన తెలిపిన రైతు

ధారూరు, జూలై 31 : పశు వైద్యుడు రాక మేక పిల్ల మృతి చెందిన సంఘటన మండలంలోని నాగారం గ్రామంలో జరిగింది. బుధవారం గ్రామంలోని పశువుల దవాఖాన బోర్డుకు మృతి చెందిన మేక పిల్లని కట్టి దశరథ్ అనే రైతు నిరసన వ్యక్తం చేశాడు. గ్రామంలో పశువుల డాక్టర్ లేక పశువులు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకే పశువుల దవాఖాన ఉన్నదని, ఎప్పుడు చూసినా తాళం వేసి ఉంటుందని రైతు పేర్కొన్నాడు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరాడు.

## సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు అమానుషం

- మాజీ మంత్రి సబితారెడ్డికి క్షమాపణలు చెప్పాలి
- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్

చేవెళ్ల రూరల్, జూలై 31 : ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ శాసనసభ సమావేశాల్లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అమానుషమని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బడ్జెట్‌పై లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన సీఎం సబితారెడ్డిపై చేసిన వ్యక్తిగత దూషణలు, ఆరోపణలు మంచిది కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే వారి గొంతు నొక్కడం ఎంతవరకు సమంజసమన్నారు. శాసనసభను అగౌరవపర్చేలా రేవంత్ పదజాలం ఉన్నదని, తక్షణమే మాజీ మంత్రి సబితారెడ్డికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో సబితారెడ్డికి తగిన గౌరవం దక్కకపోవడంతోనే పార్టీ మారారని.. సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి తీసుకువచ్చి వర్కింగ్ ప్రెసిడెంట్ చేసింది పట్లోళ్ల కుటుంబమే అని హితవు పలికారు. ఐదు దఫాలు ఎమ్మెల్యేగా, మూడుసార్లు మంత్రిగా ప్రజలకు సేవలందించి ఓటమెరుగని నాయకురాలు సబితారెడ్డి అని గుర్తుచేశారు. సీఎంకు సభ నియమాలు తెలియకనే ఇలా మాట్లాడుతున్నారన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

- తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య
- ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం


విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య

చేవెళ్ల రూరల్, జూలై 31 : డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మండల పరిధి కొండకల్ గ్రామ సమీపంలోని ఇండస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సందీప్ శాండిల్య హాజరై ప్రసంగించారు. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, వీటి నిర్మూలన మనందరి బాధ్యత అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించాలన్నారు. మత్తుకు అలవాటుపడి యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దనే సదుద్దేశంతో వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో యువతీ యువకులు మంచి అలవాట్లతో తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మాటలు విని బాగా చదువుతూ ముందుకెళ్తే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. మాదకద్రవ్యాల విషయంలో ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా టోల్ ఫ్రీ నం.8712671111కు కాల్ చేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసే దిశగా ముందుకు సాగుతామన్నారు.

ఈ సందర్భంగా ఉపన్యాసం, పెయింటింగ్‌లలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు.స్కూల్‌లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్స్ కమిటీ విద్యార్థులకు సందీప్ శాండిల్య బ్యాడ్జీలను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యాంటి నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీలు సుబ్బరామిరెడ్డి, ధర్మారెడ్డి, సీఐలు గోపి, శ్రీనివాస్‌రావు, పాఠశాల పిన్సిపాల్ ఫరీదా ఫ్రాజ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రియాంక భక్షి, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ బాలకృష్ణమూర్తి, చిప్పాడ ఫెసిలిటీ మేనేజర్ సలిన్ ఖాన్, అకౌంట్స్ మేనేజర్ మహేశ్, కార్యాచరణ సమన్వయకర్త పుష్పిత, మోకిల సీఐ వీరబాబు, ఎస్ఐ కోటేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు ప్రభుత్వ పథకాలు అందాలి


సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**

వికారాబాద్, జూలై 31 : అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలందేలా చర్యలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజాపాలన, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీలో చేపడుతున్న భవనాల పురోగతి, ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు, పారిశుధ్యం తదితర అంశాలపై ఎంపీడీవోలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాపాలనలో భాగంగా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా గ్యాస్ సబ్సిడీ, గృహజ్యోతి ద్వారా విద్యుత్తు సున్నా బిల్లుకు ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు, లబ్ధి పొందుతున్నవారి సంఖ్య ఎంత అనేవాటిపై దృష్టి సారించాలన్నారు. ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే సాంకేతిక లోపాలను సరిచేసి వారం రోజుల్లో పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏవేని సమస్యలుంటే పరిష్కరించేందుకుగాను సిబ్బందికి మండల స్థాయిలో శిక్షణాకార్యక్రమాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆగస్టు 20 లోపు అంగన్‌వాడీల్లో చేపడుతున్న మరమ్మతులు, పెయింటింగ్ పనులు పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని, వెంటిలేటర్లకు మెస్ (జాలి)లను అమర్చాలన్నారు. గ్రామపంచాయతీల్లో అసంపూర్తిగా ఉన్న వివిధ భవన నిర్మాణ పనుల వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనుల వివరాలను తెలుపాలన్నారు. పనులు పూర్తి కాకముందు, పూర్తి అయిన తర్వాత తీసిన ఫొటోలను ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ భూములను యుద్ధ ప్రాతిపదికన చదును చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రూ.37 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వ పాఠశాలల ప్రహరీల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలకు కలెక్టర్ సూచించారు. వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించి చెల్లింపులపై ఆరా తీశారు. పనులు పూర్తయినప్పటికీ చెల్లింపులో జాప్యమెందుకని సంబంధిత ఇంజినీర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తయిన వాటికి త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షాసమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్డీవో శ్రీనివాస్, డీపీవో జయసుధ, సీపీవో అశోక్ కుమార్, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో వెంకటేశ్వరమ్మ, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, డీఎల్పీవోలు సంధ్యారాణి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.


బుద్దారం గ్రామంలో పర్యటిస్తున్న వికారాబాద్ జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

## పనులతీరుపై పరిశీలన

**ఐఏఎస్ శిక్షణలో భాగంగా పెద్దేముల్, బుద్దారం గ్రామాలను సందర్శించిన వికారాబాద్ జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి**

పెద్దేముల్, జూలై 31 : పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయం, బుద్దారం గ్రామాన్ని వికారాబాద్ జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. ట్రైనీ ఐఏఎస్‌గా కలెక్టర్ శిక్షణలో భాగంగా ఆమె బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని, మండల పరిధిలోని బుద్దారం గ్రామంలో పారిశుధ్య పనులు, మురుగు కాల్వల నిర్వహణ, గ్రామపంచాయతీ వ్యవస్థ, స్థానిక సంస్థల పనితీరు, గ్రామంలో ప్రధానంగా ఉండే సమస్యలు, ప్రజల జీవన విధానం, ప్రజలు నిర్మించుకున్న ఇండ్లు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు.

అంతకుముందు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ వ్యవస్థలోని ధరణి సమస్యల పరిష్కారం తీరు, ధరణిలో భాగంగా ప్రజలు వివిధ రకాల భూ సమస్యలపై పెట్టుకున్న అర్జీల పీవోబీ, ఖాతా మెర్జింగ్, జీఎల్ఎం, టీఎం–33 ఫైల్స్, ధరణిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏవిధంగా చేస్తారో పెద్దేముల్ తహసీల్దార్ కిషన్‌ను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం బుద్దారం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి అదే గ్రామానికి చెందిన పద్మమ్మ అనే మహిళ కల్యాణలక్ష్మి పథకం అమలు కోసం పెట్టుకున్న దరఖాస్తును పరిశీలించారు. దరఖాస్తుకు పంచనామా నిర్వహించి పూర్తి వివరాలను స్వయంగా ఆమె చేతి రాతతో నింపి పూర్తి చేశారు. అనంతరం పద్మమ్మ కూతురు శ్రీలత, అల్లుడు హరిసూదన్‌రెడ్డిలను గ్రామపంచాయతీకి పిలిపించి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెళ్లి అయిపోయింది కాబట్టి ఇద్దరు కూడా చదువును మధ్యలో ఆపరాదని ఆమె సూచించారు.

గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని, వివిధ కాలనీలు, మురుగు కాల్వలు, అంతర్గత రోడ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయురాలు సరోజ పాఠశాలలో నెలకొన్న సమస్యలను ట్రైనీ కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా రెవెన్యూ వ్యవస్థ, గ్రామపంచాయతీ వ్యవస్థ, ప్రభుత్వ కార్యాలయాల పనితీరు, ప్రభుత్వ పథకాల పనితీరు, గ్రామీణ ప్రాంత ప్రజల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి పలు అంశాలను డైరీలో నోట్ చేసుకున్నారు.

కార్యక్రమంలో పెద్దేముల్ మండల కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వేణు, రికార్డ్ అసిస్టెంట్ మహేశ్, కంప్యూటర్ ఆపరేటర్ బసంత్ రెడ్డి, సిబ్బంది జనార్దన్, బుద్దారం గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, మాజీ సర్పంచ్ వెంకటయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## మెడికల్ షాపులపై డీసీఏ దాడులు

**నిబంధనలకు విరుద్ధంగా ప్రకటనలు ముద్రించిన ఔషధాలు సీజ్**


నిబంధనలకు విరుద్ధంగా ప్రకటనలు ముద్రించిన ఔషధాలను చూపిస్తున్న అధికారులు

సిటీబ్యూరో, జూలై 31 (నమస్తే తెలంగాణ): ఈ ఔషధాలు వాడితే పలానా రోగాలు నయమవుతాయంటూ నిబంధనలకు విరుద్ధంగా ప్రకటనలు ముద్రించిన ఔషధాలు విక్రయిస్తున్న మెడికల్ షాపులపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు జరిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిపిన ఈ దాడుల్లో పలు రకాల ఔషధాలను సీజ్ చేశారు. డీసీఏ డీజీ వి.బి.కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం.. ఈ మందు ఈ వ్యాధిని నయం చేస్తుందంటూ.. కొంతమంది ఔషధాలపై ప్రకటనలు ముద్రిస్తున్నారని, ఇది నబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. డ్రగ్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ చట్టం– 1954 ప్రకారం ఔషధాలపై చికిత్స పేరుతో ప్రకటనలు జారీచేయడం నేరమన్నారు. ఈ విధంగా ప్రకటనలు చేస్తే ఆరు నెలల జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉన్నదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ఫార్మా కంపెనీలు పలు రకాల ఔషధాలపై ప్రకటనలు జారీ చేస్తున్నట్లు సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు జూలై 30, 31తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు మెడికల్ షాపులపై దాడులు జరిపారు. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా, జిల్లెలగూడ, సరూర్‌నగర్, సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం, సూర్యపేట, హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న పలు మెడికల్ షాపులపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో 'పానియన్' ఆయుర్వేదిక్ మాత్రలు, అశ్వగంధరిస్టా ఆయుర్వేధిక్ టానిక్, శ్రీశ్రీ తత్వ మహాత్రిఫలద్య గ్రితం, పల్లేరుకాయల పౌడర్, ప్రోస్విన్ యూనానీ మాత్రలను సీజ్ చేశారు. ఈ మేరకు సంబంధిత ఔషధ తయారీ కంపెనీలకు నోటీసులు జారీచేశారు.

## వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 31 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ (ఆడియాలజీ), ఎమ్మెస్సీ (స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ) కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, మొదటి, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 5లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.300 అపరాధ రుసుముతో 12 వరకు చెల్లించవచ్చన్నారు. ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సు రెండు, నాలుగు, ఆరు, ఎనిమిది, పదో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, మొదటి, మూడు, అయిదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 12వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.300 అపరాధ రుసుముతో 17 వరకు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. ఈ పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

### రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ (ఏఐసీటీఈ) కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల ఎనిమిదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను రెండు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 6లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 8 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 8లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు (బీసీటీసీఏ, బీహెచ్‌ఎంసీటీ) కోర్సుల పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలతో పాటు బీఫార్మసీ (పీసీఐ) పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

### వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏఎస్ఎల్‌పీ (సీబీసీఎస్) మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 9 నుంచి, ఎంబీఏ (సీబీసీఎస్) రెండు, నాలుగో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 12 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.